www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 23 జూన్ 2025

5

ఏలూరు

నేడు యథావిధిగా పిజిఆర్ఎస్

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజా ఫిర్యాదుల పరిష్కారాన్ని మరింత వేగవంతంగా, ప్రజల దృష్టికి మరింత చేరువ చేయడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) సేవలను ఈ నెల 23వ తేదీ సోమవారం మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయిల్లో కూడా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. జిల్లా స్థాయిలో కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో యథావిధిగా పిజిఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలోనే కాకుండా ఫిర్యాదుల స్వీకరణ వ్యవస్థను ప్రభుత్వం వికేంద్రీకరించింది. ప్రజలు తమ ఫిర్యాదులను సమీప మండల కార్యాలయాల్లో, డివిజనల్ కార్యాలయాల్లో, లేదా మున్సిపల్ కార్యాలయాల్లో నేరుగా సమర్పించుకోవచ్చని తెలిపారు. ఇంటి నుంచే ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేసేందుకు ప్రభుత్వం అధికారిక వెబ్‌సైట్ https://meekosam.ap.gov.in @ ఏర్పాటు చేసిందని తెలిపారు.

కొత్త పింఛన్లు ఇచ్చేదెప్పుడు..!

'ఇరగవరం మండలానికి చెందిన మహిళ లక్ష్మి భర్త 2024 జనవరిలో అనారోగ్యంతో మృతిచెందారు. సాధారణ ఎన్నికలు దగ్గర పడడంతో కొత్త పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నా రాలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఇంకేముంది పింఛన్ వస్తుందని ఆశపడ్డారు. అయితే కూటమి ప్రభుత్వం పాలన చేపట్టి ఏడాది దాటినా ఇప్పటికీ పింఛన్ మంజూరు చేయలేదు. ఇద్దరు ఆడ పిల్లలతో ఆ మహిళ ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతోంది.'

'నిడమర్రు మండలానికి చెందిన యువకుడు మహేష్ సదరం సర్టిఫికెట్ పొంది ఏడాదిగా పింఛన్ కోసం వేచి చూస్తున్నాడు. ప్రభుత్వం కొత్త పింఛన్లు మంజూరు చేయకపోవడంతో ఆ కుటుంబం తీవ్ర ఇబ్బందులు పడుతోంది. పింఛన్ కోసం సచివాలయానికి వెళ్లి వాకబు చేసుకోవడంతోనే సరిపోతోంది.'

కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది దాటినా కొత్త పింఛన్ల జారీ శూన్యం

ప్రతి సచివాయం పరిధిలో 50 వరకూ పింఛన్ దరఖాస్తులు

వితంతువులు, వృద్ధులు, అనారోగ్య సమస్యలున్న ఎంతోమంది పింఛన్ కోసం ఎదురుచూపు

పింఛన్ల మంజూరులో జాప్యంపై జనాల్లో తీవ్ర చర్చ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గత ప్రభుత్వం ఏటా జూన్, జనవరిలో కొత్త పింఛన్ల మంజూరు చేపట్టేది. దీంతో కొత్తగా పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునేవారు ధీమాగా ఉండేవారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది దాటిపోయింది. ఇప్పటి వరకూ కొత్త పింఛన్ల మంజూరు లేదు. దీంతో పింఛన్ల కోసం వేల మంది ఎదురుచూస్తున్న పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం పశ్చిమగోదావరి జిల్లాలో 2.32 లక్షలు, ఏలూరు జిల్లాలో 2.68 లక్షల మంది పింఛన్‌దారులు ఉన్నారు. పింఛన్లు అందుకుంటున్న ఎంతోమంది వృద్ధులు ఈ కాలంలో మరణించారు. వికలాంగులు, తీవ్ర అనారోగ్యంతో పింఛన్లు పొందుతున్న వారికి మళ్లీ పరీక్షలు నిర్వహించిన చాలా మందిని అనర్హులని తేల్చడం సైతం జరిగింది. పింఛన్లు తగ్గించుకునేందుకు ప్రభుత్వం అనేక ప్రయత్నాలు చేస్తోంది. కొత్త పింఛన్ల మంజూరు గురించి మాత్రం నోరుమెదపడం లేదు. వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉండగానే చాలా మందికి 60 ఏళ్లు నిండిన వారు, భర్తను కోల్పోయిన వితంతువులు, తీవ్ర అనారోగ్యం పాలైన వారు అనేక మంది పింఛన్‌కోసం దరఖాస్తు చేసుకున్నారు. 2024 జనవరిలో వీరంతా కొత్త పింఛన్లు వస్తాయని ఆశించారు. ఎన్నికలు దగ్గర పడడంతో కొత్త పింఛన్ల మంజూరు జరగలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏడాదిగా పింఛన్ కోసం సచివాలయాలు, రాజకీయ నాయకుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ప్రభుత్వం ఇంకా సైట్ ప్రారంభించలేదని సచివాలయ సిబ్బంది చెబుతున్నారు. రోజులు గడిచిపోతున్నా ప్రభుత్వం మాత్రం కొత్త పింఛన్ల మంజూరుపై మాట్లాడం లేదు. ప్రతి సచివాలయంలోనూ దాదాపు 50 వరకూ కొత్త పింఛన్లకు సంబంధించి దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. అర్హులకు ఎప్పటికి పింఛన్ ఇస్తారో అర్థంకాకుండా పోయింది. ఇంటి పెద్దదిక్కైన భర్తను కోల్పోయిన ఎంతోమంది మహిళలు ఆర్థికంగా తీవ్రంగా నలిగిపోతున్నారు. వితంతు పింఛన్ మంజూరైతే నెలకు రూ.నాలుగు వేలు వస్తే ఆర్థికంగా ఎంతో కొంత చేయూత ఉంటుందని ఆ మహిళలంతా భావిస్తున్నారు. 60 ఏళ్లు నిండిన చాలా మంది వృద్ధాప్య పింఛన్ కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. పక్షవాతం, కిడ్నీ సమస్యలతో ఎంతోమంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం పింఛన్ మంజూరు చేస్తే వైద్య ఖర్చులకు ఉపయోగపడతాయని పింఛన్ కోసం ఆశగా చూస్తున్నారు. కొత్త పింఛన్ల జారీపై ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకూ ఎటువంటి స్పందన లేకుండా పోయింది. పింఛన్ల మంజూరులో జాప్యంపై తీవ్ర వ్యతిరేకత రావడంతో పింఛన్ తీసుకుంటూ భర్త చనిపోయిన మహిళలకు స్పౌజ్ పింఛన్లు మాత్రం ఇవ్వడం జరిగింది. కొత్త పింఛన్లకు సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసి, వెంటనే మంజూరు చేయాలని జనం కోరుతున్నారు. సంక్షేమ పథకాల అమలుకు సంబంధించి ప్రభుత్వం తీవ్ర కాలయాపన చేస్తుందన్న భావన జనాల్లో ఏర్పడుతోంది. పింఛన్ల మంజూరులో జరుగుతున్న జాప్యం జనాల్లో తీవ్ర చర్చ కొనసాగుతోంది.

కొనసాగిన మెగా డిఎస్‌సి పరీక్షలు

మెగా డిఎస్‌కి 478 విద్యార్థులు హాజరు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉపాధ్యాయ నియామక పరీక్షలు మెగా డిఎస్‌సి 2025 ఆదివారం ఏలూరులో ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 9:30 గంటల నుంచి 12 గంటల వరకూ సిద్ధార్థ క్వెస్ట్ పాఠశాలలో 180 మందికి 173 మంది హాజరు కాగా ఏడుగురు గైర్హాజరయ్యారు. ఏలూరు ఇంజినీరింగ్ కళాశాలలో 140 మందికి 135 మంది హాజరు కాగా ఐదుగురు గైర్హాజరయ్యారు. సిఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన పరీక్షకు మొత్తం 207 మందికి 193 మంది హాజరు కాగా 14 మంది గైర్హాజరయ్యారు. మొత్తం మూడు కేంద్రాల్లో 527 మందికి 501 మంది హాజరు కాగా 26 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం రెండున్నర గంటల నుంచి 5 గంటల వరకూ సిద్ధార్థ క్వెస్ట్‌లో 180 మందికి 168 మంది హాజరు కాగా 12 మంది గైర్హాజరయ్యారు. ఏలూరు ఇంజినీరింగ్ కళాశాలలో 140 మందికి 120 మంది హాజరు కాగా 20 మంది గైర్హాజరయ్యారు. సిఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన పరీక్షలకు మొత్తం ఎంతమంది 200 మందికి 190 మంది హాజరు కాగా 10 మంది గైర్హాజరయ్యారు. మొత్తం మూడు కేంద్రాల్లో 520 మందికి 478 మంది హాజరు కాగా 42 మంది గైర్హాజరయ్యారు.

మాట్లాడుతున్న నరసింహారావు

ఎల్ఐసి ఏజెంట్ల సంక్షేమానికి కృషి

ఎల్ఐసి ఎఒఐ సౌత్ సెంట్రల్ జోనల్ ప్రధాన కార్యదర్శి నరసింహారావు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

భారత జీవిత బీమా సంస్థలో పనిచేస్తున్న ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి పాటుపడుతున్న సంస్థ ఎల్ఐసి ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఒక్కటేనని ఎల్ఐసి ఎఒఐ సౌత్ సెంట్రల్ జోనల్ (ఆంధ్ర ,తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల) ప్రధాన కార్యదర్శి పిఎల్.నరసింహారావు అన్నారు. ఎల్ఐసి ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఏలూరు శాఖ మహాసభ ఆదివారం ఏలూరులో పవర్‌పేట ఉద్దరాజు రామం భవనంలో జరిగింది. సభకు ఆహ్వాన సంఘం అధ్యక్షులు తాళం సురేష్, స్టీరింగ్ కమిటీ ఛైర్మన్ కోడే రాంబాబు, స్టీరింగ్ కమిటీ మెంబర్ వైఎస్.కనకారావు అధ్యక్షతన నిర్వహించిన సభకు ముఖ్య అతిథిగా సౌత్ సెంట్రల్ జోనల్ సెక్రటరీ పిఎల్.నరసింహారావు హాజరై ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ ఐఆర్‌డిఎ నిబంధనల మేరకు ఎల్ఐసి పనిచేస్తుందని, ఈ క్రమంలో ఏజెంట్ల కమిషన్లు తగ్గించడంపై ఉధృతంగా పోరాటం సాగిస్తుందని అన్నారు. అనేక పోరాటాల ఫలితంగానే బీమా ఏజెంట్ల సంక్షేమానికి కొన్ని హక్కులు సాధించుకున్నామని పేర్కొన్నారు. పోరాడితే పోయేదేమీ లేదని సమస్యలు పరిష్కారం అవుతాయని ఆయన పిలుపునిచ్చారు. ముఖ్యఅతిథి సీనియర్ బ్రాంచి మేనేజర్ ఎస్.శ్రీనివాసరావు, భీమడోలు బ్రాంచి మేనేజర్ ఎన్.భువన దీప మాట్లాడుతూ సంస్థ అభివృద్ధికి ఏజెంట్లు ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డివిఎన్‌విడి ప్రసాద్ మాట్లాడుతూ కార్మిక హక్కుల సాధనకై జులై 9వ తేదీన జరిగే సమయంలో ఎల్ఐసి ఏజెంట్లు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఎల్ఐసి ఎఒఐ రాష్ట్ర అధ్యక్షులు టి.కోటేశ్వరరావు, జనరల్ సెక్రటరీ జి.రవికిషోర్, డివిజనల్ అధ్యక్షులు విశ్వేశ్వరరావు, సెంట్రల్ కమిటీ సభ్యులు డివి.రామకృష్ణ, జోనల్ ఇసి మెంబర్ రామ్మోహన్‌రావు, ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు సుధాకర్ పాల్గొన్నారు.

యోగాంధ్ర కాదు ఉద్యోగాంధ్ర కావాలి

సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

రాష్ట్రంలో యోగాంధ్ర కాదు ఉద్యోగాంధ్ర కావాలని సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం తెలిపారు. ఏలూరు జిల్లాలోని కన్నాపురం కృష్ణా ఫంక్షన్ హాల్లో సిపిఎం జిల్లా స్థాయి సభ్యుల సమావేశాలు తెల్లం దుర్గారావు అధ్యక్షతన ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలు ప్రజా సమస్యలు పట్టించుకోకుండా యోగా పేరిట దృష్టి మరల్చే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. మతోన్మాద చర్యలతో ప్రజల దృష్టిని పక్కదోవ పట్టించేందుకు కూటమి ప్రభుత్వం యోగాంధ్రాను అడ్డం పెట్టుకుందన్నారు. రాష్ట్రంలో ఉద్యోగాంధ్ర కావాలని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగ ఖాళీల భర్తీ, ప్రత్యేక డిఎస్‌సి నిర్వహణ వంటి హామీలను కూటమి ప్రభుత్వం మరచిపోయిందన్నారు. సూపర్ సిక్స్ వాగ్దానాల అమలులో వెనుకబడిందని విమర్శించారు. జివిఎల్ నరసింహారావు మాట్లాడుతూ దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతూ, అదానీ, అంబానీలకు కోట్ల రూపాయల రాయితీలు ఇస్తూ, సామాన్య ప్రజలపై పన్నుల భారం మోపుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ, మొడియం నాగమణి, జిల్లా కమిటీ సభ్యులు మానుకొండ జీవరత్నం, గూడెల్లి వెంకట్రావు, సిపిఎం మండల కార్యదర్శి శుక్ల బోయిన రాంబాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంతెన సీతారాం

క్రీడాకారిణులపై లైంగిక వేధింపులు..!

ఏలూరులోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (శాయ్)లో దారుణ పరిస్థితులు

కేంద్ర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన క్రీడాకారిణులు

కేంద్ర బృందం రహస్య విచారణ

టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

క్రీడల్లో రాణించాలని ఎన్నో ఆశలతో అడుగుపెట్టిన క్రీడాకారిణులైన బాలికలపై ఏలూరు జిల్లా కేంద్రం స్పోర్ట్స్ అథారిటీ (శాయ్)లో ప్రధాన కోచ్‌తోపాటు, సహచర కోచ్ లైంగిక వేధింపులకు పాల్పడినట్లు తేలడం సంచలనం రేపుతోంది. దర్యాప్తు చేసిన కేంద్ర బృందం శనివారం రాత్రి ఏలూరు టుటౌన్ పోలీస్‌స్టేషన్‌లో లైంగిక వేధింపులకు పాల్పడిన కోచ్‌లపై ఫిర్యాదు చేయడం చూస్తే పరిస్థితి తీవ్రత ఏంటో అర్థమవుతుంది. ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియం పక్కనే ఏర్పాటు చేసిన శాయ్ కేంద్రంలో క్రీడాకారిణులపై లైంగిక వేధింపులు హెచ్చుమీరడంతో వారంతా కేంద్ర కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. పది మంది మహిళా క్రీడాకారిణులు శాయ్ నిర్వాహకులు, వెయిట్ లిఫ్టింగ్ కోచ్‌పై ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. ఏలూరు శాయ్ ఇన్‌ఛార్జితో పాటు వెయిట్ లిఫ్టింగ్ జూనియర్ కోచ్ అసభ్యంగా ప్రవర్తిస్తూ లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఏలూరులోని శాయ్‌ల అథ్లెటిక్స్‌లో బాలురు, బాలికలు తర్ఫీదు పొందుతున్నారు. వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో బాలికలు ఎక్కువగా ఉన్నట్లు చెబుతున్నారు. బాలికలకు శాయ్ హస్టల్లోనే వసతి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిసింది. బాలురకు అల్లూరి సీతారామరాజు స్టేడియంలోని గదుల్లో వసతి కల్పిస్తున్నారు. బాలికలపై ప్రధాన కోచ్ వినాయక్‌తో పాటు, సహచర కోచ్‌లు లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్లు క్రీడాకారిణులు శాయ్ కేంద్ర కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. దీంతో ఏలూరు జిల్లా శాయ్‌లో చోటుచేసుకుంటున్న పరిణామాలపై కేంద్రం కార్యాలయం బెంగుళూరు శాయ్‌లోని ఇద్దరు సభ్యుల బృందాన్ని విచారణకు ఆదేశించింది. విచారణ బృందం ఏలూరు శాయ్‌లో గత కొద్ది రోజులుగా రహస్య విచారణ చేపట్టి క్రీడాకారిణులైన బాలికలు చేసిన ఫిర్యాదులు వాస్తవమేని నిర్ధారించినట్లు తెలుస్తోంది. బెంగుళూరు నుంచి వచ్చిన శాయ్ విచారణ అధికారులు ఏలూరు టూటౌన్ పోలీస్ స్టేషన్లో దీనిపై ఫిర్యాదు చేశారు. ఏలూరులో శిక్షణ పొందుతున్న క్రీడాకారుణుల నుండి పూర్తిస్థాయి వివరాలను అధికారులు సేకరించారు. కొందరు బాలికలు ఉండడంతో విచారణ వివరాలు కేంద్ర కార్యాలయానికి అప్పగించనున్నట్లు తెలుస్తోంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రధాన కోచ్ వినాయక కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రధాన కోచ్ వినాయక్ కొందరు బాలికలను తన ఆఫీసు గదికి పిలిచి అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా వారిపై వేయకూడని చోట చేతులు వేసి లైంగిక వేధింపులకు గురి చేస్తున్నాడని ఏలూరు రెండో పట్టణ పోలీస్ స్టేషన్లో చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై ఏలూరు జిల్లా వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. క్రీడాకారిణుల లైంగిక వేధింపులపై మీడియాలో రావడంతో ఈ ఘటనపై విచారణ ఊపందుకుంది. బాలికల సంరక్షణ అధికారులు, పోలీసులు, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా బృందం సంయుక్తంగా ఆదివారం రెండో రోజు కూడా విచారణ సాగించింది.

శాయ్‌లోని ట్రెయినింగ్ హాల్

ఆర్‌టిసి బస్సు బ్రేకులు ఫెయిల్

తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి- ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల నుంచి తణుకు వెళ్తున్న తణుకు డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు బ్రేక్ ఫెయిలై అదుపు తప్పింది. త్రుటిలో ప్రమాదం తప్పడంతో అందరూ ఊపరి పీల్చుకున్నారు. ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు ద్వారకాతిరుమల నుంచి పల్లెవెలుగు బస్సు సుమారు 60 మంది ప్రయాణికులతో తణుకు బయలుదేరింది. ఈ క్రమంలో ఆలయ సెంటర్ డిసిసిబి బ్యాంక్ సమీపంలోకి వచ్చేసరికి బ్రేక్ ఫెయిలై డిసిసిబి సెంట్రల్ బ్యాంక్ ఎదురుగా ఉన్న కరెంటు పోల్‌ను, గోవిందా లాడ్జి స్లాబ్ కార్నర్‌ను ఢీ కొట్టి ఆగింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న ఇద్దరు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. బస్సు డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. కండక్టర్ డిపో మేనేజర్‌కు సమాచారం ఇచ్చి ప్రయాణికులను ఇతర బస్సులను ఎక్కించి పంపించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ క్లియర్ చేసి వివరాలు నమోదు చేసుకున్నారు.

బ్రేకులు ఫెయిలైన ఆర్‌టిసి బస్సు

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

ఏజెన్సీ గిరిజన సంఘం

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కుంజం రామారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రాజెక్టు నిర్వాసితులందరికీ భూమి, సంపూర్ణమైన పునరావాసం కల్పించాలని, 2013 భూసేకరణ చట్ట ప్రకారం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా కొండమొదలు నేల దోనెలపాడు ఆర్అండ్ఆర్ కాలనీ ఆదివాసీ నిర్వాసితులకు ప్రభుత్వం ప్రత్యేకంగా అమలు చేయాల్సిన హామీలన్నింటిని నెరవేర్చాలని, గ్రామాలు ఖాళీ చేసేనాటికి 18 ఏళ్లు నిండిన యువతకు పరిహారం అందించాలని, విలీన మండలాలతో సహా నిర్వాసితులందరికీ పరిహారం అందించాలని పేర్కొన్నారు. నేషనల్ పార్కు పేరిట ఆదివాసీ గిరిజన గ్రామాలను ఖాళీ చేయించరాదని, నిర్వాసితుల సాగులో ఉన్న కొండపోడు భూములు, వన సంరక్షణ సమితిలకు నష్టపరిహారం అందించాలని పేర్కొన్నారు. ఆదివాసీ హక్కులకు భంగం కలిగించరాదని, పోలవరం మండలంలోని తెల్లవరం, చేగొండపల్లి, సింగన్నపల్లి, ఎర్రవరం తదితర గ్రామాల ఆర్అండ్ఆర్ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని, తెల్లవరం గ్రామంలో 30 కుటుంబాలకు ఇవ్వాల్సిన భూమిని తక్షణమే ఇవ్వాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 24న కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ధర్నాలో నిర్వాసితులు, ప్రజాతంత్రవాదులు పాల్గొనాలని పేర్కొన్నారు.

పేదల ఇళ్ల స్థలాలపై పెద్దల కన్ను..!

పోలీస్‌స్టేషన్‌కు కేటాయించడంపై లబోదిబో

ఆశ్చర్యంగా 20 ఏళ్లుగా చేయని మెరక క్షణాల్లో చేసిన వైనం

న్యాయం చేయాలని కోరుతున్న లబ్ధిదారులు

ప్రజాశక్తి - మండవల్లి

పేదల ఇళ్ల స్థలాలను మెరక చేయడంలో అధికారులు, నాయకుల్లో ఉన్న నిర్లక్ష్యంతో 20 ఏళ్లుగా లబ్ధిదారులు మగ్గిపోతున్నారు. పేదల ఇళ్ల స్థలాల్లో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలనే పెద్దల నిర్ణయంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. ఇల్లు లేని 131 మంది నిరుపేదలను గుర్తించి తరుగుమూల వద్ద 482 సర్వే నెంబర్‌లో 4.10 ఎకరాల భూమిని కొనుగోలు చేసి ఇందిరమ్మ గృహాలు వెంటనే నిర్మించాలని పట్టాలను గృహ నిర్మాణ శాఖకు 2006లో అప్పగించారు. గతంలోనే రెవెన్యూ కార్యాలయం వద్ద పోలీస్ స్టేషన్‌కు సుమారు 25 సెంట్ల స్థలం కేటాయించారు. అయితే గ్రామంలో పోలీస్ స్టేషన్ నిర్మాణం సరికాదని, ఇబ్బందులు తలెత్తుతాయని పెద్దలు ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. గ్రామానికి సుమారు కిలోమీటర్ దూరంలో ఉన్న పేదల ఇళ్ల స్థలాలపై పెద్దలు కన్నేసి గుట్టు చప్పుడు కాకుండా పోలీస్‌స్టేషన్‌కు స్థలం కేటాయించినట్లు సమాచారం. ఇదిలా ఉంటే తహశీల్దార్ ఒత్తిడి చేయడంతో స్థలాన్ని పోలీస్‌స్టేషన్‌కు కేటాయిస్తూ తీర్మానించానని కార్యదర్శి చెప్పడం కొసమెరుపు. దీంతో ఇదే అదునుగా భావించిన పోలీసులు స్థలాన్ని సర్వే చేయకుండా పేదల ఇళ్ల స్థలాలను పోలీస్ స్టేషన్‌లో కలిపేసుకుంటూ ఎన్‌హెచ్ కాంట్రాక్టర్‌కు చెందిన వాహనాల సహాయంతో సుమారు 40 పైబడి టిప్పర్ల మట్టితో క్షణాల్లో మెరక చేసేశారు. స్థలాన్ని మెరకచేయండంటూ 20 ఏళ్లుగా పోరాటాలు చేసినా, ప్రాధేయపడినా పట్టించుకోకుండా పోలీస్‌స్టేషన్‌కు స్థలం కేటాయించి క్షణాల్లో మెరక వేయడంపై లబ్ధిదారులు ఆశ్చర్యానికి, అసహనానికి లోనయ్యారు. పోలీస్ స్టేషన్ స్థలం కేటాయింపుపై బోర్డు మీటింగ్‌లో చర్చించకుండా దొంగ చాటుగా ఎలా తీర్మానిసా ్తరంటూ, వెంటనే తీర్మానం రద్దు చేయాలంటూ ధ్వజమెత్తారు. తీర్మానం రద్దు చేసే అధికారం కార్యదర్శికి ఉందంటూ కార్యదర్శి సున్నితంగా చెప్పడంతో వార్డు మెంబర్లతో సర్పంచి తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని పేదల ఇళ్ల స్థలాలపై ఒక నిర్ణయం వచ్చేవరకు పోలీస్ స్టేషన్ ఏర్పాటు నిలుపుదల చేయాలని సర్పంచి తహశీల్దార్‌కు విన్నవించినట్లు తెలిసింది. ఇప్పటికైనా ఉన్నతాధి కారులు స్పందించి ప్రజలకు పోలీస్ స్టేషన్ అందుబాటులో ఉంచే విధంగా ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నచోటే ఏర్పాటు చేసి పేదల ఇళ్ల స్థలాల్లో ఇల్లు నిర్మించుకునేలా చేయాలని వారు కోరుతున్నారు.

పంచాయతీ బోర్డు మీటింగ్ జరగలేదు

అడపా జానీ, వార్డు మెంబర్

పోలీస్ స్టేషన్‌కు స్థలం కేటాయించాలనేదానిపై బోర్డ్ మీటింగ్ పెట్టలేదు. అయినప్పటికీ స్థలం కేటాయించారని తెలిసి బోర్డు మీటింగ్‌లో సర్పంచిని, కార్యదర్శిని నిలదీశాం. ఎజెండాలు ఇచ్చినట్లు తీర్మానం పుస్తకంలో సంతకాలు చేయించుకుని తీర్మానించడం సరికాదని, తీర్మానం రద్దు చేయాలని చెప్పాం. సర్పంచితో కలిసి తహశీల్దార్ వద్దకు వెళ్లి పేదల ఇళ్ల స్థలాల మెరకపై స్పష్టత వచ్చేంతవరకు స్థలం కేటాయింపును నిలుపుదల చేయాలని చెప్పాం.

పోలీస్ స్టేషన్ స్థలం గురించి చర్చించాలన్నారు

ఆగుల్లు సత్యనారాయణ, వార్డ్ మెంబర్

పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయడానికి స్థలం కోసం చర్చించాలన్నారు. మూడు చోట్ల స్థలాలు ఉన్నాయని చెప్పారు. ఏదో ఒక చోట స్థలం కేటాయిద్దామన్నారు. అయితే దానికి సంబంధించి బోర్డు మీటింగ్ పెట్టలేదు. పోలీస్ స్టేషన్ స్థలం గురించి సంతకాలు తీసుకుంటున్నట్లు మాకు చెప్పలేదు. బోర్డు మీటింగ్‌లో చర్చించకుండా స్థలం ఎలా కేటాయించారని అడిగాం. కార్యదర్శి, సర్పంచి సమాధానం చెప్పలేదు.

మేము అభివృద్ధి చెందితే మీకు నచ్చదా

బుద్ధుల రామారావు, వార్డ్ మెంబర్

ఒకే ఇంట్లో రెండు, మూడు కుటుంబాల వారం జీవిస్తున్నాం పేదల ఇళ్ల స్థలాలు పోలీస్ స్టేషన్‌కు ఎలా కేటాయిస్తారని ప్రశ్నించాం. మేము అభివృద్ధి చెందితే మీకు నచ్చదా అంటూ బోర్డు మీటింగ్‌లో నిలదీశాను. తీర్మానం రద్దుచేసి ఇళ్ల స్థలాలు మెరక చేయాలని గట్టిగా చెప్పాను.

ఇల్లు కట్టుకుందాం అనుకున్నా

కసిరెడ్డి ప్రసన్న

నాకు ఇచ్చిన స్థలంలో ఇల్లు కట్టుకుందామని ఎంతో ఆశించాను. మెరక చేస్తారని 20 ఏళ్లుగా ఎదురుచూసి చూసి నా భర్త చనిపోయాడు. కుమార్తెతోనే అద్దె ఇంట్లో ఉంటున్నాను. కుమారుడికి వివాహమై వేరే చోట ఉంటున్నాడు. నేను నా కుమార్తె ఒంటరిగా ఉంటున్నాం.స్థలాలు మెరక చేస్తే ఇల్లు నిర్మించుకుంటాను.

అద్దె కట్టలేక పోతున్నాను

గిరిజాల పద్మ

స్థలం ఉండి ఇల్లు కట్టుకోలేక 20 ఏళ్లుగా అద్దె ఇంటికి అద్దెలు కట్టలేక నానా అవస్థలు పడుతున్నాను. మెరక చేస్తారని ఇల్లు కట్టుకుందామని ఎప్పటినుంచో ఎదురుచూస్తున్నాను. ఇళ్ల స్థలాలు మెరక చేసి ఇల్లు నిర్మించుకొనేలా చేస్తారని కోరుకుంటున్నాను.

పోలీస్ స్టేషన్‌కు స్థలం కేటాయించినట్లు నాకు తెలియదు

జొన్నలగడ్డ నాగలక్ష్మి, ఉప సర్పంచి

పేదల ఇళ్ల స్థలాల్లో పోలీస్ స్టేషన్‌కు స్థలం కేటాయించినట్లు నాకు తెలియదు. దానికి సంబంధించిన ఎజెండా కాపీ కూడా నాకు ఇవ్వలేదు. పోలీస్ స్టేషన్‌కు స్థలం కేటాయించేసిన తర్వాత బోర్డు మీటింగ్ పెట్టారు. ఆ మీటింగ్‌లో వార్డు మెంబర్లు సర్పంచిని, కార్యదర్శిని నిలదీస్తుంటే తెలిసింది. తీర్మానం రద్దు చేయాలని వార్డు మెంబర్లు కోరారు.

నియోజకవర్గ పరిశీలకులుగా విఠల్, రామచంద్రరాజు

ప్రజాశక్తి - భీమడోలు

టిడిపి ఉంగుటూరు నియోజకవర్గ పరిశీలకులుగా కైకలూరు నియోజకవర్గానికి చెందిన మాజీ ఎంఎల్‌సి కె.విఠల్, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.రామచంద్రరాజు నియమితులయ్యారని ఆప్కాబ్ ఛైర్మన్, టిడిపి ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు తెలిపారు. వీరితోపాటు పార్టీ భీమడోలు మండల పరిశీలకులుగా పోలవరం నియోజకవర్గం కుక్కునూరు మండలానికి చెందిన ఎం.నాగేశ్వరరావు, గణపవరం మండలానికి పోలవరం నియోజకవర్గం ఏలేటిపాడు మండలానికి చెందిన అశోక్, నిడమర్రు మండలానికి ఏలూరు నియోజకవర్గం ఏలూరుకు చెందిన పూజారి నిరంజన్, ఉంగుటూరు మండలానికి ఏలూరు నియోజకవర్గం ఏలూరుకు చెందిన వందనాల శ్రీనివాసరావు పరిశీలకులుగా నియమితులయ్యారన్నారు. భీమడోలులోని పార్టీ కార్యాలయంలో ఆదివారం టిడిపి గ్రామ, మండల స్థాయి కార్యవర్గ ఎంపికను నిర్వహించారు. ఈ మేరకు నియోజకవర్గ స్థాయిలో కార్యకర్తల ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశాలకు నియోజకవర్గ, మండల స్థాయి పరిశీలకులు హాజరై ఎన్నికల ప్రక్రియను పరిశీలించారు. గ్రామ, మండల స్థాయి పార్టీ కార్యవర్గాల ఎంపిక ఏకగ్రీవంగా జరిగినట్టు గన్ని వీరాంజనేయులు తెలిపారు.

రేపు నూజివీడులో జాబ్ మేళా

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు ప్రభుత్వ ఐటిఐ కళాశాల ఆవరణలో ఈనెల 24వ తేదీ మంగళవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రధానాధికారి రజిత ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, ఐటిఐ ఆ పైన ఉత్తీర్ణత సాధించిన వారు తమ బయోడేటా, సర్టిఫికెట్స్‌తో జాబ్ మేళాకు హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 08656 - 232711 సంప్రదించాలని పేర్కొన్నారు. ఈ సదవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కె.శ్రీనివాస్

స్మార్ట్ మీటర్ల బిగింపు నిలిపివేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శ్రీనివాస్

ప్రజాశక్తి - కలిదిండి

విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపును ప్రభుత్వం నిలుపుదల చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.శ్రీనివాస్ అన్నారు. మండలంలోని భాస్కరరావుపేటలో విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపునకు వ్యతిరేకంగా ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా రూ.16 వేల కోట్ల అదనపు విద్యుత్ ఛార్జీల భారాన్ని ప్రభుత్వం ప్రజలపై మోపిందన్నారు. గత ప్రభుత్వం పెంచిందని నెపంతో ఈ ప్రభుత్వం ట్రూ అప్ ఛార్జీల భారాన్ని ప్రజలపై వేసిందని విమర్శించారు. స్మార్ట్ మీటర్లను ధ్వంసం చేయాలని గతంలో నారా లోకేష్ చెప్పారని, నేడు మంత్రి అయ్యాక వాటిని బిగించాలని చెప్పడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. అదానీతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను, పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కలిదిండి ప్రాంతీయ కమిటీ కార్యదర్శి ఎస్.మహంకాళిరావు, కమిటీ సభ్యులు వి.భాస్కరరావు, జె.మహేష్, డి.వి.సత్యనారాయణ, బి.రామానగేంద్రం, వి.వరలక్ష్మి పాల్గొన్నారు.

జీవన భవిష్యత్తు కార్యాచరణపై సర్వే

ప్రజాశక్తి - ముసునూరు

గ్రామాల్లో ప్రజల మౌలిక సదుపాయాల కల్పన కోసం వారి జీవన భవిష్యత్తు కార్యాచరణపై సర్వే నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రాజు తెలిపారు. మండల కేంద్రమైన ముసునూరు గ్రామంలోని ఎస్‌సి, ఎస్‌టి, బిసి ఏరియాల్లో జీవనం కొనసాగిస్తున్న ముఠా కార్మికులు, వ్యవసాయ కూలీలు, రోజువారి ఉపాధి కూలీలు వారి జీవన విధానంపై సిపిఎం నాయకులు సర్వే నిర్వహించారు. వారి జీవన మనుగడ విషయాలను తెలుసుకునేందుకు సర్వే చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కొడవలి శ్రీనివాస్, రైతు సంఘం కార్యదర్శి సిహెచ్.శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

నెరవేరిన రెండు గ్రామాల ప్రజల కల

వంతెన నిర్మాణ పనులు పరిశీలించిన ఎంపిపి

ప్రజాశక్తి - ముదినేపల్లి

రెండు గ్రామాల ప్రజల గత 50 ఏళ్ల కల నెరవేరిందని ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. రెండు గ్రామాల ప్రజలు ఎంతగానో ఎదురు చూస్తున్న చిగురుకోట - బొమ్మినంపాడు గ్రామాల మధ్య రాకపోకలకు సంబంధించి పెద్ద కొమ్మిలేరు మేజర్ డ్రెయిన్‌పై వంతెన నిర్మాణం కల నేటికి నెరవేరిందన్నారు. ఆదివారం ఆయన రెండు గ్రామాల మధ్య పెదకొమ్మిలేరు డ్రెయిన్‌పై నిర్మిస్తున్న నూతన వంతెన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వంతెన నిర్మాణంతో రెండు గ్రామాల ప్రజలు ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. గతంలో ఎంతోకాలంగా ఈ వంతెన నిర్మాణానికి ఎంతోమంది నాయకులు ఎన్ని విధాలుగా ప్రయత్నించినా ఫలితం లేకపోయిందన్నారు. ఈ వంతెన నిర్మాణం చేపట్టడాని నిర్మాణానికి మండల పరిషత్ నిధుల నుంచి రూ.పది లక్షలు కేటాయించినట్లు చెప్పారు. సుమారుగా రూ.ఐదు లక్షలు రైతులు, తన సోదరుడు రామిశెట్టి ప్రసాద్ సహకారంతో వంతెన నిర్మాణం చేపట్టి పూర్తి చేసినట్లు తెలిపారు. త్వరలో వంతెన ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఈ వంతెన వల్ల చిగురుకోట, బొమ్మినంపాడు, ముంజలకుదురు, అల్లూరు, కొరగుంటపాలెం, ఈడేపల్లి, గ్రామాల ప్రజలకు కూడా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అదేవిధంగా మండవల్లి మండలంలోని ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రజలకు ఈ వంతెన రవాణాను సాగించేందుకు ఎంతగానో ఉపయోగంగా ఉంటుందన్నారు. ఈ వంతెన నిర్మాణం ఎన్నో ఏళ్లుగా నిర్మించకపోవడం వల్ల ఆయా గ్రామాల ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు. ఈ సందర్భంగా వంతెన నిర్మాణానికి సహకరించిన ఎంపిపి సత్యనారాయణకు మండల ప్రజలు సంతోషం వ్యక్తం చేసి కృతజ్ఞతలు తెలిపారు.

పనులు పరిశీలిస్తున్న ఎంపిపి

విద్యార్థికి నగదు ప్రోత్సాహకం

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని తెడ్లం గ్రామానికి చెందిన కంకిపాటి గణేష్ పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి ప్రతిభ కనబరిచాడు. ఈ సందర్భంగా అదే గ్రామానికి చెందిన కేతిరెడ్డి సీతా రామిరెడ్డి చంద్రకాంతమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా వారి కుమారుడు కేతిరెడ్డి వీరారెడ్డి(బిసిబాబు) ఆదివారం విద్యార్థికి నగదు ప్రోత్సాహం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెదవేగి అంబేద్కర్ గురుకుల పాఠశాలలో చదివి పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 550 మార్కులు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులకు, పుట్టిన గ్రామానికి మంచి పేరు తీసుకు రావాలని ఆయన ఆకాంక్షించారు.

నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా : వైసిపి

ప్రజాశక్తి - కుక్కునూరు

కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గడిచినా ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి పథకాలను అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ కలెక్టరేట్ వద్ద ఈ నెల 23వ తేదీన పోలవరం మాజీ ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు, పార్టీ జిల్లా అధ్యక్షులు దూలం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు పార్టీ మండలాధ్యక్షుడు తాండ్ర రాజేష్ తెలిపారు. ఈ ధర్నాలో యువజన, విద్యార్థి విభాగాల నాయకులు, కార్యకర్తలు, నియోజకవర్గ, మండల అనుబంధ సంఘాల అధ్యక్షులు తప్పక పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేరాలు - ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - మండవల్లి

రోడ్డు ప్రమాదంలో మండవల్లికి చెందిన వ్యక్తి దుర్మరణం పాలైన సంఘటన మండవల్లి మండలం లో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండవల్లి మండలంలోని కానుకొల్లు గ్రామానికి చెందిన ఆకేటి శ్రీహరి భార్య సింగరాయపాలెంలోని తల్లిదండ్రుల వద్దకు వెళ్లింది. శనివారం సాయంత్రం భార్య దగ్గరికి శ్రీహరి సింగరాయపాలెం వెళ్లేందుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. మార్గమధ్యంలో వర్షం రావడంతో మునిపేడు మండలం పేరూరు వద్ద రోడ్డు పక్కనే నిలుపుదల చేసి ఉన్న లారీ కనిపించకపోవడంతో ఆ లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో శ్రీహరి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ వీరభద్రరావు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం ఆదివారం బంధువులకు అప్పగించారు.

మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండలంలోని మిట్టగూడెం గ్రామంలో జరిపిన దాడుల్లో మిట్టగూడెం గ్రామానికి చెందిన పలగాని నాగరాజు, వెలివెల తేజ, మరీదు శ్రీనివాసరావు అదుపులోకి తీసుకొని 26 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ ఎ.మస్తానయ్య తెలిపారు. మద్యం షాపుల యజమానులు ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు వ్యాపారం చేయాలన్నారు. బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేసే షాపులపై కేసులు నమోదు చేస్తామని, బెల్ట్ షాపుల నిర్వాహకులు ఎటువంటి అనుమతులు లేవని చెప్పారు. బెల్ట్ షాపులు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

దోమ కాటుకు గురి కాకుండా చూసుకోవాలి

రమణక్కపేట పిహెచ్‌సి వైద్యులు కరిముల్లా

చిట్ చాట్

ప్రజాశక్తి - ముసునూరు

వర్షాకాలం వస్తున్న నేపథ్యంలో వ్యాధులు రాకుండా గ్రామ ప్రజలు ముందుస్తూ జాగ్రత్త చర్యలు తీసుకోవాలని రమణక్కపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ఎండి.కరిముల్లా సూచించారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు తెలిపారు.

ప్రశ్న : రోజు పిహెచ్‌సిలో ఎంత ఒపి ఉంటుంది. ఏఏ ప్రాంతాల నుంచి రోగులు వస్తారు?

వైద్యులు : పగలు 80 నుంచి వంద వరకు ఒపి ఉంటుందని, రాత్రులు 20 నుంచి 50 వరకు ఉంటుందని తెలిపారు. రమణక్కపేట, అక్కిరెడ్డిగూడెం, తూర్పుదిగవల్లి, సూరేపల్లి, పడమర దిగవల్లి, ముక్కోల్లుపాడు, నెహ్రూనగర్, కంద్రిక, చిత్తపూర్, చెక్కపల్లి పోమవారం, మర్లపాలెం గ్రామాల నుంచి రోగులు వస్తుంటారు.

ప్రశ్న : మండలంలో డెంగీ, మలేరియా కేసులు ఎన్ని నమోదయ్యాయి?

వైద్యులు : రమణక్కపేట పిహెచ్‌సి పరిధిలో డెంగీ, మలేరియా వంటి కేసులు ప్రస్తుతం ఏం లేవు.

ప్రశ్న : పిహెచ్‌సిలో మందుల కొరత ఉందా?

వైద్యులు : మందుల కొరత లేదు. సబ్ సెంటర్ల పరిధిలోకి సరిపడే మందులు కూడా ఉన్నాయి.

ప్రశ్న : రమణక్కపేట పిహెచ్‌సి పరిధిలో ఎన్ని సబ్ సెంటర్లు ఉన్నాయి? అవి ఏవి?

వైద్యులు : తొమ్మిది సబ్ సెంటర్లు ఉన్నాయి. అక్కిరెడ్డిగూడెం, చెక్కపల్లి, సూరేపల్లి, లోపూడి, గుళ్లపూడి, గుడిపాడు, వలసపల్లి, మర్లపాలెం, కొత్తగూడెం గ్రామాల పరిధిలో సబ్ సెంటర్లు ఉన్నాయి.

ప్రశ్న : వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

వైద్యులు : వర్షాకాలం సమయంలో వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలి. దోమకాటుకు గురి కాకుండా దోమ తెరలు వాడాలి. జ్వరాలు వచ్చినప్పుడు నాటు వైద్యం కాకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి వైద్య సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

అంగన్వాడీ కేంద్రం పైకప్పు ఏర్పాటు చేయాలి

చిన్నారుల తల్లిదండ్రుల వేడుకోలు

ప్రజాశక్తి - పోలవరం

వేసవి కాలంలో వచ్చిన ఈదురుగాలులకు వర్షానికి అంగన్వాడీ స్కూలుపై కప్పు ఎగిరిపోయిన అంగన్వాడీ భవనానికి మరమ్మతులు చేసి భవనంపై రేకు ఏర్పాటు చేయాలని వెంకటరెడ్డిగూడెం అంగన్వాడీ పిల్లల తల్లులు కొవ్వాసు ముత్యాలమ్మ, కొవ్వాసు రామదుర్గాభవాని, భానురేఖ, తేజ, శిరీష, దీవెన, కొవ్వాసు సూర్యకుమారి కోరారు. అంగన్వాడీ కేంద్రంలో పిల్లలను కూర్చోబెట్టడానికి వీలులేని పరిస్థితుల్లో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. చుట్టుపక్కల ఇళ్లల్లో కేంద్రాన్ని నడపాల్సిన దుస్థితిలో ఉందని వాపోతున్నారు. ఇలా ఇబ్బందులు పడుతున్న మారుమూల ఏజెన్సీ గిరిజన గ్రామంలో అంగన్వాడీ కేంద్రాన్ని అధికారులు కనెత్తి చూడడం లేదని ఆక్షేపిస్తున్నారు. ఐటిడిఎ అధికారులు కూడా పట్టించుకోకపోవడం పట్ల వారు ఆగ్రహిస్తున్నారు. నెలలు తరబడి అంగన్వాడీ కేంద్రం ఉపయోగంలో లేకపోవడంతో పిల్లలకు, గర్భిణులకు వచ్చే పౌష్టికాహారం దాయడం కష్టసాధ్యంగా ఉంటుందని, ప్రీస్కూల్‌కు చాలా ఇబ్బందికరంగా ఉంటుందని, కరెంటు కూడా లేని ఒక ఇరుకింటిలో ఫ్యాను కూడా లేకుండా ఉక్కపోతలో కేంద్రాన్ని నడుపుతున్నామని అంగన్వాడీ కార్యకర్త ఆవేదన వ్యక్తం చేశారు. అరుగు మీద వంట చేసే పరిస్థితి వచ్చిందని, 26 మంది పిల్లలు, నలుగురు తల్లులు ఈ అంగన్వాడీ స్కూల్లో లబ్ధిదారులని, చిన్ని గ్రామామని కేంద్రం నడపడానికి మరో ఇల్లు కూడా లేదన్నారు. అందువల్ల ఇబ్బందులు పడాల్సి వస్తుందని వివరించారు. ఇప్పటికైనా అధికారులు గిరిజన గ్రామమైన వెంకటరెడ్డిగూడెంపై దృష్టి కేంద్రీకరించి అంగన్‌వాడీ కేంద్రం పై కప్పు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

మాట్లాడుతున్న తలిదండ్రులు

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీలు

ప్రజాశక్తి - మండవల్లి

మండవల్లి మండలంలో మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పనులపై సామాజిక తనిఖీలు జరుగుతున్నాయని ఎంపిడిఒ రామలింగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 29 గ్రామ పంచాయతీల్లో ఈ నెల ఒకటో తేదీ నుంచి 23 వరకు ఎన్‌ఆర్‌ఇజిఎస్ పథకం ద్వారా నిర్వహించిన పనులపై సామాజిక తనిఖీలు జరుగుతున్నాయన్నారు. సామాజిక తనిఖీల అనంతరం మండల పరిషత్ కార్యాలయం వద్ద 24న సామాజిక ప్రజావేదిక నిర్వహిస్తున్నామన్నారు. సామాజిక తనిఖీలు ఉపాధి పనులపై గుర్తించిన అంశాలపై అధికారులు చర్చిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, ఉపాధి కూలీలు, శ్రమశక్తి సంఘాలు తప్పనిసరిగా పాల్గొనాలని ఆయన కోరారు.

పల్లెరమూడిలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండల పరిధిలోని పల్లెర్లమూడి గ్రామంలో జ్యోతి రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో కీళ్ల నొప్పులు, చిన్నపిల్లల వ్యాధులు, ఉబ్బసం, ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులు, కంటి సంబంధిత వ్యాధులకు ఉచిత పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. 25 మంది సిబ్బంది పాల్గొని పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. డాక్టర్లను టిడిపి పల్లెర్లమూడి నేతలు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సిలారపు చిట్టిబాబు, గ్రామ సర్పంచి పులపాక సౌమ్యరేఖ, గ్రామస్తులు దావులూరి కృష్ణమోహన్, ఎనమండల సత్యనారాయణ, బెజవాడ శ్రీనివాసరావు, బడిపాటి రాజేష్, శిలారపు సంగీతరావు పాల్గొన్నారు.

యుద్ధాలను వ్యతిరేకించాలి : ఇఫ్టూ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆగస్టు 28, 29, 30, 31 తేదీల్లో ఏలూరులో జరిగే ఇఫ్టూ రాజకీయ శిక్షణా తరగతులు జయప్రదం చేయాలని ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పోలారి పిలుపునిచ్చారు. ఆదివారం ఏలూరు కాశీ విశ్వేశ్వర కళ్యాణ మండపంలో జరిగిన ఇఫ్టూ అనుబంధ కార్మిక సంఘాల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గాజాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణకాండ ఆగకుండానే ఇప్పుడు ఇరాన్‌పై అమెరికా సాగించిన బాంబుల వర్షం ప్రపంచ ప్రజలకు తీవ్ర నష్టకరమన్నారు. ఈ యుద్ధాలను వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు. దేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల పట్ల కార్మికులు రాజకీయ చైతన్యంతో పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఇఫ్టూ నగర ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఇఫ్టూ రాష్ట్ర సహాయ కార్యదర్శి యువి, ఇఫ్టూ జిల్లా అధ్యక్షులు కెవి.రమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, జిల్లా ఉపాధ్యక్షులు రామ్మోహన్, జిల్లా సహాయ కార్యదర్శి మామిడి దానవరప్రసాద్ పాల్గొన్నారు.

ప్రపంచాన్ని మార్చే ఆయుధం విద్య మాత్రమే

బంజారా బజరంగీ భేరీ సంఘం జిల్లా నాయకులు భూక్యా నాగరాజు నాయక్


మాట్లాడుతున్న నాగరాజునాయక్

ప్రజాశక్తి - టి.నరసాపురం

ప్రపంచాన్ని మార్చే ఆయుధం విద్య మాత్రమేనని బంజారా బజరంగీ భేరీ సంఘం జిల్లా నాయకులు భూక్యా నాగరాజు నాయక్ అన్నారు. మండలంలోని టి.నరసాపురం పంచాయతీలోని కృష్ణాపురం గ్రామంలో బంజారా బజరంగీ భేరీ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పదో తరగతి, ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు జిల్లా స్థాయి చేతక్ మెరిట్ స్కాలర్ షిప్ నగదు విద్యార్థులకు అందించి, విద్యార్థుల తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన నాగరాజు నాయక్ మాట్లాడుతూ విజ్ఞానవంతులు సమాజ గతిని మార్చి ప్రగతికి బాటలు వేస్తారన్నారు. పేదరికం కష్టాలను అనుభవించినా ఉన్నత విద్యను సాధించాలన్నారు. బడుగు బలహీన బంజారా తరగతుల విద్యార్థులకు విద్యలో పోటీతత్వాన్ని పెంపొందించేందుకు బంజారా భజరంగీ భేరి సంఘం తరపున ప్రతి సంవత్సరం చేతక్ మెరిట్ స్కాలర్ షిప్‌ను ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జరభల కృష్ణనాయక్, భూక్యా వేణుగోపాల్, శ్రీనివాస్ నాయక్, ఇస్లావత్ ప్రేమ్ చంద్, హనుమంతు, భూక్యా రాజా నాయక్, జరభల చందా నాయక్, విజయ్ కుమార్, బాణావత్ వేణు, జరబల రమేష్, ధరావత్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బెల్టుషాపులపై ఉక్కుపాదం

ప్రొహిబిషన్, ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్ ఎ.ఆవులయ్య

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

బెల్ట్ షాపుల నిర్వాహకులపై ఉక్కు పాదం మోపుతామని ప్రొహిబిషన్, ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్ ఎ.ఆవులయ్య హెచ్చరించారు. నూజివీడు పట్టణంలోని ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్‌ను ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక పాత్రికేయులతో మాట్లాడుతూ ఇప్పటివరకు జిల్లాలో బెల్ట్ షాపులకు సంబంధించి 425 కేసులు నమోదు చేశామన్నారు. వీటిలో 227 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. బెల్ట్ షాపులకు సంబంధించి ఆక్రమంగా ఉన్న మద్యం 1,207 లీటర్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. జిల్లాలో సారాను పూర్తిగా రూపు మాపినట్లు తెలిపారు. సారాకు సంబంధించి 752 కేసులు నమోదు చేయగా, 762 మందిని ఎప్పటికీ అదుపులోకి తీసుకున్నామన్నారు. సారా విడనాడి బయటకు వచ్చిన వారికి ఉపాధి కల్పించేందుకు తాము ఎప్పుడూ సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఇందులో భాగంగానే ఇటీవల జిల్లా కలెక్టర్ వారి సమక్షంలో 40 కుటుంబాలకు స్వయం ఉపాధి కల్పనలో భాగంగా వడ్డీ లేని రుణాలను అందించామన్నారు. ప్రతిఒక్కరూ స్వయంకృషితో కష్టపడి ఆర్థిక అభివృద్ధి చెందాలని సూచించారు. ఎలాంటి జాగ్రత్తలు లేకుండా విచ్చలవిడిగా కాసే సారా వల్ల ఆరోగ్యాలు వేగంగా క్షీణిస్తాయన్నారు. సారాపై ప్రభుత్వం సమరం సాగించినట్లు చెప్పారు. సారాను 99 శాతం రూపుమాపినట్లు తెలిపారు. త్వరలో ఏలూరును సారా రహిత జిల్లాగా ప్రకటించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో నూజివీడు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ ఎ.మస్తానయ్య పాల్గొన్నారు.

దిగబడిన లోడు చేపల లారీ

గంటల పాటు నిలిచిన అనేక వాహనాలు

కల్వర్టుకు రంధ్రం పడడంతో పెద్ద వాహనాలను నిలువరించాలని కోరుతున్న స్థానికులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

లారీని బయటకు తీస్తున్న జెసిబి

చేబ్రోలు పోలీసు స్టేషన్ నుంచి నారాయణపురం కాలువ గట్టు కంకర రోడ్డులో చేపల లారీ ఆదివారం దిగబడిపోయింది. ఎస్ఐ సూర్యభగవాన్ పర్యవేక్షణలో రెండు భారీ క్రెయిన్ల సాయంతో లారీని బయటకు తీసేందుకు గంటల తరబడి శ్రమించాల్సి వచ్చింది. దీంతో అనేక వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. నారాయణపురం బ్రిడ్జి ఈ నెల 15న పాక్షికంగా కూలడంతో వాహనాల రాకపోకలను పోలీసులు నిషేధించారు. ఈ క్రమంలో నారాయణపురం ఐస్ పరిశ్రమ తదితర ప్రాంతాల నుంచి చేపలలోడు లారీలు కాలువ గట్టు వెంబడి పోలీసు స్టేషన్ వద్ద వంతెన మీదుగా జాతీయ రహదారిని చేరుకోవాల్సి వస్తోంది. శనివారం రాత్రి కురిసిన వర్షానికి అంతంత మాత్రంగా ఉన్న కంకర రోడ్డు బురదగా మారి భారీ వాహనాలు దిగబడి పోతున్నాయని, తేలిక పాటి వాహనాలు తప్ప మిగతా వాహనాలన్నింటిని దారి మళ్లించామని పోలీసులు చెప్పారు. గణపవరం నుంచి నారాయణపురం వచ్చే వాహనాలను తాడేపల్లిగూడెం మీదుగా మళ్లించినట్లు పోలీసులు హెచ్చరిక బోర్డులు పెట్టారు. ఇదిలా ఉండగా భారీ వాహనాలు తిరగడం వల్ల నారాయణపురం రామాలయం రోడ్డులో తూర కల్వర్టుకు రంధ్రం పడిందని పెద్ద వాహనాలను నిలివరించకపోతే కల్వర్టు పగిలిపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారీ వాహనాలు రాకుండా గెడ్డర్లు వేయిస్తామని సర్పంచి అలకనంద వెల్లడించారు.

ముంపు నుంచి తెరుకోని వరిచేలు

తరచూ వర్షాలతో ఆందోళనలో రైతులు - మరమ్మతుకు నోచుకోని డ్రెయిన్లు

ప్రజాశక్తి - ముదినేపల్లి

నీట మునిగిన విత్తనాలు వెదజల్లిన వరిచేలు

ముదినేపల్లి పరిసర గ్రామాల్లో కురుస్తున్న వర్షాలకు సార్వా వరి పొలాలు ఇంకా ముంపులోనే ఉన్నాయి. తరచూ కురుస్తున్న వర్షాలతో వరి పొలాల్లో నీరు తగ్గడం లేదు. ఈ నెల మొదటివారంలో రైతులు పలు గ్రామాల్లో పొలాలను సిద్ధం చేసి విత్తనాలను వెదజల్లారు. మరి కొంతమంది నారుమడులు పోశారు. ఈ తరుణంలో రోజు ఏదో సమయంలో కురుస్తున్న వర్షంతో విత్తనాలు వెదజల్లిన పొలాలన్నీ నీట మునిగాయి. పలు గ్రామాల్లో నారుమడులు కూడా ముంపు బారిన పడ్డాయి. దీంతో రైతులు పొలాల్లోని నీటిని బయటకు మళ్లించేందుకు చర్యలు చేపట్టారు. గుల్ల పంపులతో పొలాలను నీటిని బయటకు తోడుతున్నారు. ఈనెల 11న కురిసిన భారీ వర్షంతో పాటు తరచూ కురుస్తున్న వర్షంతో విత్తనాలు వెదచల్లిన పొలాలన్నీ చెరువులను తలపిస్తున్నాయి. చేలల్లో ముంపు ఇంకా తగ్గక ముందే తరచూ వర్షం కురవడంతో రైతన్న కష్టాలు అధికమయ్యాయి. పంట బోదెలు, మీడియం, మైనర్ డ్రెయిన్లు బాగు చేయకపోవడంతో వీటిలో దట్టంగా డెక్క పేరుకుపోయి నీటిపారుదలకు అడ్డంకిగా మారుతున్నాయని రైతులు అంటున్నారు. గత నెలలో పంట బోదెలు, డ్రెయిన్లలో పేరుకుపోయిన తూడు, తొలగించి ఉంటే పొలాలు ముంపు బారిన పడేవి కాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేలల్లో ముంపు తగ్గని పక్షంలో విత్తనాలు నీటిలో నాని కుళ్లిపోతాయాని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని చినపాలపర్రు తదితర గ్రామాల్లో పొలాలు ఇంకా ముంపులోనే ఉన్నాయి. చేలల్లో ముంపు నీరు తగ్గకుంటే ఇప్పటివరకు పెట్టిన పెట్టుబడి అంతా బూడిద పాలవుతాయని రైతులు లబోదిబోమంటున్నారు.

24 నుంచి ఆధార్ కార్డుల నమోదు, నవీకరణ

ఎంపిడిఒ పద్మావతి దేవి

ప్రజాశక్తి - భీమడోలు

మండలంలోని వివిధ సచివాలయాల పరిధిలో ఈ నెల 24వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ఆధార్ కార్డుల నమోదు, నవీకరణ నిర్వహించేందుకు ఆధార్ మొబైల్ క్యాంపులను ఏర్పాటు చేసినట్లు ఎంపిడిఒ పద్మావతి దేవి తెలిపారు. దీనిలో భాగంగా గుండుగొలను సచివాలయం-1 యూనిట్ ఆధ్వర్యంలో 24, 25వ తేదీల్లో భోగాపురం సచివాలయం, 26, 27వ తేదీల్లో గుండుగొలను సచివాలయం వద్ద క్యాంపులు ఏర్పాటు చేశామన్నారు. పూళ్ల గ్రామ సచివాలయం-1 యూనిట్ ఆధ్వర్యంలో ఈ నెల 24 ,25వ తేదీల్లో ఎంఎం.పురం, 26, 27వ తేదీల్లో దుద్దేపూడి సచివాలయాల వద్ద, భీమడోలు గ్రామ సచివాలయం-1 యూనిట్ ఆధ్వర్యంలో 24 ,25వ తేదీల్లో అంబర్ పేట, 26, 27వ తేదీల్లో భీమడోలు గ్రామ సచివాలయాల వద్ద ప్రత్యేక ఆధార్ మొబైల్ క్యాంపులు అందుబాటులో ఉంటాయని ఎంపిడిఒ తెలిపారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి

ఎంపిడిఒ శ్రీనివాస్‌బాబు

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని కొరుటూరు తూటిగుంట పునరావాస గ్రామాల్లో ఎంపిడిఒ చెరుకూరి శ్రీనివాస్‌బాబు ఆధ్వర్యంలో ఆదివారం ప్రధానమంత్రి జన్‌మన్ ధర్తి ఆబ జన్‌భగి దరి అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలు అందని వారు 15 రోజుల పాటు జరిగే జన్మన్ దర్తి అబ జన్‌భగి దరి అభియాన్ కార్యక్రమంలో ఫిర్యాదు చేస్తే అక్కడికక్కడే సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. గిరిజనులకు కుల, నివాస, ఆదాయ ధ్రువపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ సిబ్బంది, సర్పంచులు, వార్డు మెంబర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISION), TADEPALLIGUDEM

I.P.No.16/2025

Between:

Sypureddy Rambabu ...**Petitioner**

And

1.Jillelamudi Dairyalakshmi
2.Vankina Bala Naga Venkata Sri Rama Rao
3. The Official Receiver ...**Respondents.**

To, 1st Respondent:
Jillelamudi Dairyalakshmi,
W/o Subash Chandra Bose,
Door No.2-135, Durgamma gudi Veedhi,
Prathipadu village, Pentapadu Mandalam,
West Godavari District, TPG SCJ.

2nd Respondent:
Vankina Bala Naga Venkata Sri Rama Rao,
S/o Akkayya Chowdary, Door No.1-53-14/3A,
Road No.4, Tirumala Nest, F.C.I Colony,
Tadepalligudem, West Godavari District,
TPG SCJ.

3RD Respondent:
The Official Receiver, Eluru, West Godavari District, Eluru.

NOTICE

Please take notice that the Petitioner filed the above Creditor Insolvency petition against you for adjudicate the 1st respondent as insolvent and to Set-a-side documents Nos.18474/2024 executed by the 1st respondent in favour of the 2nd respondent and for administration of debts of the 1st respondent including the debt of the petitioner under the promissory note dated 27-03-2024 executed by the 1st respondent in favour of the petitioner for an amount of Rs.5,00,000/- i.e., petition B schedule property. The Honourable court ordered to made publication to you through the Praja Sakthi News paper, Tadepalligudem. So, you are all here by directed to appear before the Honourable court at 10-30 A.M on 04-07-2025 to which date the above creditor insolvency petition stands posted either in person or through an advocate and file your counters if any regarding the objections to the petition, If you are failed to appear before the Honourable court at 10-30 A.M on 04-07-2025 the petition will be decided in your absence.

(By order of the court)

K. MANI KUMAR,
Advocate for Petitioner
Tadepalligudem.

Tadepalligudem
Date: 05-06-2025

పోలవరం పురుషోత్తపట్నం ఫెర్రీ టెండరు కం బహిరంగ వేలం ప్రకటన
మండల ప్రజా పరిషత్ పోలవరం కార్యాలయం ఏలూరు జిల్లా

ఆర్.ఓ.సి. నెం.8/19/2025 **తేది.13-06-2025**

ఏలూరు జిల్లా ముఖ్య కార్యనిర్వహణాధికారి, జిల్లా ప్రజా పరిషత్ ఏలూరు వారి ఉత్తర్వులు ఆర్.ఓ.సి.నెం. 8/19/2025 తేదీ 27.01.2025 జి.ఓ.ఎం.ఎస్. నెం. 253 తేదీ 08.08.2012 పంచాయితీరాజ్ అండ్ డెవలప్‌మెంట్ (ఎం.డి.ఎల్-1) ఆంధ్రప్రదేశ్ ప్రకారం పోలవరం పురుషోత్తపట్నం వద్ద ఫెర్రీ రేవు సుంకం వసూలు చేసుకొనుటకు 2025-26 సంవత్సరాలకు అనగా ది. 01.06.2025 నుండి 31.03.2026 వరకు హక్కులు కల్పించడానికి ది. 27.06.2025 న టెండరు కం బహిరంగ వేలం నిర్వహించబడును. పాటలో పాల్గొనుటకు ఆసక్తి కలిగినవారు ముందుగా పోలవరం మండల ప్రజాపరిషత్ కార్యాలయం పనివేళల్లో వేలం ధరఖాస్తుని పొందవలెను. టెండరు షెడ్యూలు ధర 1000/- చలానా స్టేట్ బ్యాంకు నుండి ఉప ఖజానా కార్యాలయంలో ఎంపిడిఒ నిధుల పద్దు 84-18-109-001 నకు పోలవరం డిడిఒ కోడ్ 0413-2202 నకు పాటదారుని పేరుతో జమ చేయవలెను. జిఎస్టీ నిమిత్తం 180 రూ/లు ఎంపిడిఒ పోలవరం బ్యాంకు ఖాతా నెం. 11617922447 ఐఎఫ్ఎస్‌సి కోడ్ ఎస్‌బిఐఎన్ 0000778 నకు పాటదారుని పేరిట జమచేసి రశీదు పొందవలెను. 25.06.2025 తేదీ సాయంత్రం 5 గంటల లోపు కార్యాలయంలో టెండరు షెడ్యూలు పొందవలెను. ధరావతు సొమ్ము 3 లక్షలు ఎస్‌బిఐ బ్రాంచి నుండి ఎంపిడిఒ ఆఫీసర్ పోలవరం పేరిట డిడి తీసుకోవాలి. 18 లక్షల తాజా సాల్వెన్సీ పేరిట తీసుకోవాలి. బోటు లైసెన్సు, ఇన్సూరెన్సు, అనుభవం సంబంధిత ధ్రువపత్రాలు విధిగా సమర్పించాలి. ప్రభుత్వం పాట 11,50,000 రూ/లు. ది. 27-06-2025 న మధ్యాహ్నం 2 గంటల నుండి ఎంపిడిఒ కార్యాలయం వద్ద టెండరు కం బహిరంగ వేలం నిర్వహించబడుతుంది. మరిన్ని వివరాలకు ఎంపిడిఒ పోలవరం కార్యాలయంలో సంప్రదించండి.

మండల ప్రజాపరిషత్ అధికారి
మండల ప్రజా పరిషత్ పోలవరం
ఫోన్ నెం. 94937 42454